క్లుప్తంగా

పండుగ సామగ్రి పంపిణీ



ధన్వాడ: మండల కేంద్రంలో సోమవారం ఎంపీటీసీ మాధవి దివ్యాంగులకు, పంచాయతీ సిబ్బంది, పేదవారికి పండుగ సామగ్రిని పంపిణీ చేశారు. ఏరువాక పండుగ వంట సామగ్రి పంపిణీ చేసినట్లు ఆమె తెలియజేశారు. ఇందులో మాజీ సర్పంచ్ అరుణ, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయభాను, మందిపల్లి పాఠశాల హెచ్ఎం నరేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నర్వ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలు, ఉపాధిహామీ మేటీలు, సిబ్బంది పాల్గొనాలన్నారు. ఈ నెల 6 నుంచి 17 వరకు గ్రామాల్లో చేపట్టిన 14వ విడుత సామాజిక తనిఖీలో గ్రామసభలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఆవరణలో నిర్వహించే బహిరంగ సామాజిక సమీక్ష సమావేశంలో చేపట్టిన పనుల వివరాలు, తనిఖీలో బయటపడే అంశాలను ప్రజల ముందు వివరిస్తారన్నారు.

బొడ్రాయికి ప్రత్యేక పూజలు



ఊట్కూరు: ఊట్కూరులో బొడ్రాయిలను ప్రతిష్ఠించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేన్‌బజార్, బస్టాండ్, ఎల్‌బీనగర్, పాతపేట తదితర ప్రాంతాల్లో బొడ్రాయిలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మహిళలు సుజాత, లక్ష్మి, వెంకటమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం



మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లిలోని పాత పాఠశాల భవనం నిరుపయోగకరంగా ఉందని, దానిని వినియోగంలోకి తీసుకొచ్చి అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 250 మందికి పైగా విద్యార్థులు ఉండగా.. కేవలం మూడు తరగతి గదులు మాత్రమే ఉన్నాయని, అందులో ఓ గది శిథిలావస్థకు చేరుకుందని వాపోతున్నారు. మిగిలిన రెండు గదుల్లో ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండగా.. విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగకరంగా ఉన్న పాత పాఠశాల భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పశువుల తరలింపును అడ్డుకున్న నాయకులు



దామరగిద్ద: పశువులను వాహనాల్లో తరలిస్తున్నట్లు గుర్తించిన బీజేపీ నాయకులు సింగారం ఆంజనేయులు దామరగిద్ద మండల కేంద్రంలోని సజనాపూర్ వెళ్లే రహదారిపై అడ్డుకున్నారు. ఎస్‌ఐ వసంతకు ఫిర్యాదు చేయగా.. పశువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. మద్దూర్ మండలం దమగ్నాపూర్‌కి చెందిన రైతు అంజప్పకు చెందిన పశువులను సంతలో విక్రయించేందుకు కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్‌కు తరలిస్తున్నట్లు గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. గురిమ్టకల్‌లో సోమవారం పశువుల సంత లేదని బీజేపీ నాయకులు చెప్పడంతో పశువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వదిలిపెట్టడంతో తిరిగి ఇంటికి తరలించారు. బక్రీద్ కావడంతో పశువుల విక్రయాన్ని అడ్డుకున్నామని, పోలీసుల సహకారంతో బక్రీద్‌కు పశువులను బలి చేయకుండా కట్టడి చేయాలన్నదే మా ఉద్దేశమని, ఇది రైతులు గుర్తించాలని బీజేపీ నాయకులు తెలియజేశారు.



మాగనూర్‌లో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొంటున్న ముస్లింలు



మక్తల్‌లో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న వివిధ పార్టీల నాయకులు



నర్వ మండలం లంకాల్‌లో...

త్యాగానికి ప్రతీక బక్రీద్

సాక్షి, నెట్‌వర్క్: నారాయణపేట, మక్తల్ నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే మసీద్‌ల వద్దకు చేరుకుని సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలో భాగంగా పండుగ ప్రత్యేకతను మత పెద్దలు వివరించగా, ఆ తర్వాత పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

- మక్తల్ పట్టణంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముస్లింలకు పండు శుభాకాంక్షలు తెలియజేశారు.
- మాగనూర్‌లో జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డితో పాటుగా వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.
- మక్తల్ మండలంలోని చిట్యాల, అనుగొండ, లింగంపల్లి, కర్ని, సంగంబండ, మంతన్‌గోడ్, గుడిగండ్ల, జక్లేర్, భూత్పూర్ గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ నిర్వహించుకున్నారు.
- త్యాగానికి ప్రతీకైన బక్రీద్‌ను నర్వ మండలంలోని ఆయా గ్రామాల్లో మైనార్టీలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నర్వ, లంకాల్, రాంపూర్, రాయికోడ్, పెద్దకడ్మూర్, కల్వాల్, బెక్కర్‌పల్లి గ్రామాల్లోని ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



మక్తల్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

- ఊట్కూరు మండలంలో చిన్నపొర్ల, పులిమామిడి, బిజ్వార్, పెద్దజట్రం తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ఉదయం 8 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
- మరికల్ మండల కేంద్రం, ఎలిగండ్ల, అప్పంపల్లి, కన్మనూర్, జిన్నారం, మాధవరం, తీలేర్ గ్రామాల్లో బక్రీద్ పండుగను నిర్వహించుకున్నారు.



కోస్గిలో...



నారాయణపేటలోని కోటకొండలో..



ధన్వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



నారాయణపేటలోని కొల్లంపల్లిలో



ఊట్కూరులో ...



మరికల్ మండలం ఎలిగండ్లలో..



మరికల్ మండలం జిన్నారంలో...



మద్దూరు ఈద్గా వద్ద..

భక్తిశ్రద్ధలతో లింగమయ్య జాతర



కర్నిలో లింగమయ్య స్వామి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మక్తల్: మండలంలోని రుద్రసముద్రం, కర్నిలో లింగమయ్యస్వామిని ఊరేగింపుగా కృష్ణానది వరకు తీసుకెళ్లి అక్కడ పుష్కర నీటిని తీసుకొని ఆలయంలో స్వామివారికి పుష్కర స్నానం చేయించారు. గ్రామంలో లింగమయ్యస్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఉపాధిహామీ అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నర్వ: మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు మహేందర్ డిమాండ్ చేశారు. ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు జరిగిన అవకతవకలను బయటపడకుండా సామాజిక తనిఖీని తూతూమంత్రంగా గ్రామాల్లో చేపట్టారన్నారు. గ్రామ సభలను సరిగ్గా నిర్వహించకుండా ప్రజలకు పనుల వివరాలను తెలియజేయడంలో విఫలమయ్యారన్నారు. సామాజిక తనిఖీ చేపట్టే కొద్ది రోజుల ముందు తాము చేపట్టిన పనులకు అప్పటికప్పుడే బోర్డులు ఏర్పాటు చేశారని ఆరోపించారు. జాబ్‌కార్డులు కావాలంటే సిబ్బందికి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సామాజిక తనిఖీ సమీక్ష సమావేశంలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వంతెన లేక అవస్థలు

మాగనూర్: మండల పరిధిలోని గజ్జరందొడ్డి పెద్ద వాగుపై వంతెన లేకపోవడంతో వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా ఈ మార్గం నుంచి మక్తల్ పట్టణానికి కొల్పూర్, మందిపల్లి, గజ్జరందొడ్డి గ్రామాల ప్రజలు నిత్యం పదుల సంఖ్యలో ప్రయాణం సాగిస్తుంటారు. వర్షాకాలంలో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంటుందని, దీంతో నెలల తరబడి ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. మందిపల్లి నుంచి మక్తల్‌కు వాడ్వట్ మీదుగా వెళ్లేందుకు బీటీ రోడ్డు ఉన్నా.. చాలా దూరం ఉండటంతో తక్కువ దూరం ఉన్న ఈ మార్గంలో ప్రయాణించడానికి ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వంతెన లేకపోవడంతో ఆటోను తోసుకొస్తున్న ప్రయాణికులు

తప్పని.. తిప్పలు



మక్తల్ బీసీ కాలనీలోని పాఠశాల భవనం



ఉప్పర్‌పల్లిలో ప్రాథమిక పాఠశాల భవనం

- శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలల భవనాలు
- వర్షం వస్తే ఇంటికి వెళ్తున్న విద్యార్థులు
- పాఠశాలల వైపు కన్నెత్తి చూడని అధికారులు

మక్తల్: ప్రభుత్వాలు మారినా విద్యార్థుల తలరాతలు మాత్రం నేటికీ మారడంలేదు. ఒకపక్క అధికారులు.. మరో పక్క ప్రజాప్రతినిధులు సమస్యలపై దృష్టి సారించకుండా వృథాగా వదిలేస్తున్నారు. మండలంలోని తిర్మలాపూర్‌లో వ్యవసాయ పొలంలో పాఠశాల నిర్మాణం చేపట్టారు. అక్కడకు పశువులు, పాములు చేరుకుంటున్నాయి. పాఠశాలలో రెండు గదుల నిర్మాణం చేపట్టారు. గంట కొడితే బడికి, వర్షం వస్తే ఇంటికి అన్నట్లుగా నెలకొంది. పస్పులలో ఇరుకు గదులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నగోప్లాపూర్‌లో పాఠశాల గ్రామపంచాయతీ కార్యాలయంలో విద్యాభ్యాసం కొనసాగుతుంది. ఉప్పర్‌పల్లిలో వర్షం వస్తే ఉరుస్తుంది. కిటికీలు, తలుపులు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండదొడ్డి, వానాయికుంట శిథిలావస్తకు చేరుకోవడంతో నూతనంగా నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సోమేశ్వర్‌బండలో రెండు గదులు ఉన్నా.. అవి సక్రమంగా లేవు. మక్తల్‌లో పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉప్పర్‌పల్లిలో విద్యార్థులు నేలపై కూర్చొనే పరిస్థితి ఏర్పడింది. నీటి ట్యాంకుల వద్ద మురుగు నెలకొంది. భూత్పూర్‌లో పాఠశాల రిజర్వాయర్ వద్ద ఉండటంతో పాముల బెడద నెలకొంది. దాదాన్‌పల్లిలో పాఠశాల వద్ద చెత్త వేస్తున్నారు. ఆయా పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉండగా.. దాదాపు 100 మంది విద్యార్థులు ఉంటున్నారు.



తిర్మలాపూర్‌లో విరిగిన కిటికీలు, దర్వాజలు

నిధులు మంజూరైతే మరమ్మతు..

మండలంలోని పాఠశాలలకు నిధులు మంజూరైతే వెంటనే పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం.

– వెంకటయ్య, ఎంఈఓ, మక్తల్



దాదాన్‌పల్లిలో పాఠశాల భవనం



ముస్లాయిపల్లిలో పాఠశాల భవనం

ప్రభుత్వ ఆదాయానికి గండి

- ధన్వాడ పెద్దచెరువు నుంచి ఒండ్రుమట్టి తరలింపు
- 24 ట్రిప్పులకు అనుమతి
- తరలించింది 300 ట్రిప్పులు
- కనిపించని అధికారుల పర్యవేక్షణ

ధన్వాడ: ఒండ్రు మట్టి అక్రమ తరలింపునకు ధన్వాడ పెద్దచెరువు వేదికగా మారింది. భూమిలో పోషకాలు పెరిగేందుకు చెరువులోని ఒండ్రు మట్టిని రైతులు పొలాల్లోకి తీసుకెళ్తారు. అందుకు రెవెన్యూ అధికారులతో అనుమతి తీసుకొని రైతులు మాత్రమే తరలించాల్సి ఉంటుంది. కాని ధన్వాడ మండల కేంద్రంలోని పెద్దచెరువులోని ఒండ్రు మట్టిని కొంత మంది గుత్తేదారులు ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. రెవెన్యూ అధికారులతో కేవలం 12 టిప్పర్లకు రెండు చొప్పున మొత్తం 24 ట్రిపులకు అనుమతులు తీసుకున్నారు. కాని 20 టిప్పర్లను ఐదు ఇటాచీలను ఏర్పాటు చేసి, దాదాపు 300 నుంచి 400 ట్రిప్పుల చెరువు మట్టిని తరలించారు. అధికారులు అనుమతులు ఇచ్చిన తరువాత తరలించే సమయంలో పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కాని అనుమతులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఒక్క టిప్పరుకు ప్రభుత్వానికి రూ.1,000 కట్టి అనుమతులు తీసుకున్నారు. 24 ట్రిప్పులకు గాను రూ.24,000 ప్రభుత్వానికి జమ చేశారు. కేవలం 24 ట్రిప్పులు తీసుకెళ్లాల్సి ఉండగా.. సదరు వక్తి దాదాపు 300 నుంచి 400 ట్రిప్పుల మట్టిని చెరువులో నుంచి తరలించారు. మట్టిని తరలించేందుకు చెరువులో నుంచి రోడ్డు వరకు ప్రత్యేకంగా రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. మట్టిని తరలించేప్పుడు ధన్వాడ ప్రధాన రాహదారి వెంట అత్యంత వేగంగా టిప్పర్లను నడుపుతున్నారు. టిప్పర్లపై ఎలాంటి కాగితం కప్పకపోవడంతో వేగానికి మట్టి కిందపడి రోడ్డు మొత్తం మట్టిమయంగా మారింది. ఇతర వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేచి అక్కడ వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపరులు, కొనుగోళ్లదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయమై తహసీల్దార్ సింధూజాను వివరణ కోరగా.. 24 ట్రిప్పులకు మాత్రమే అనుమతి ఇచ్చామని తెలియజేశారు.



ధన్వాడ పెద్ద చెరువులో నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్లు